# పాములూ నిచ్చెనలూ



డి. కమలాదేవి

అన్నాళ్ళూ, అపురూపంగా, ఎంతో జాగ్రతగా, కాపాడుకొని దాచుకున్న నా యౌవన సంపదని, సర్వస్వాన్నీ, మనసా, వాచా, నా భర్తకు సమర్పించి, ఆ పారవశ్యంలో కళ్ళు మూసుకున్నాను....

కలలు తెరలుగా రాసాగాయి....అంత కమ్మని ఊహల్లో కూడా గడచిన స్మృతుల్లోని భయాలు వదల్లేదు!....

ఈ రోజు కోసం ఎంత ఎదురు చూశానని!

ఈ సుదినం కోసం ఎంత తపస్సు చేశానని!

ఈ శుభదినం కోసం ఎంత వేచి వున్నానని!

ధనవంతుడు తన ధనాన్ని ఎట్లా కాపాడుకుంటాడో, కాపుకు వచ్చిన పంటని రైతు ఎట్లా కాపాడుకుంటాడో — అట్లా నన్ను నేను కాపాడుకుంటూ వచ్చాను.

ధనాన్ని ఒకరు దోచుకోకుండా కాపాడుకుందుకు సాధనాలున్నాయేమో, పంట పరులపాలు కాకుండా చూసుకుందుకు ఉపాయాలున్నాయేమోగాని.... నాలాటి యౌవనంలో వున్న యువతి తనను తాను కాపాడుకుందుకు యీ రోజుల్లో ఏ రక్షణా లేదనిపిస్తుంది.

అందులోనూ యీ నవనాగరికతా ప్రపంచంలో, అనుక్షణమూ అదే దృష్టితో వున్నవారి నుండి తప్పించుకోవడం ఎంత కష్టం!

ఎన్ని చిక్కులు! ఎన్ని అడ్డంకులు! ఎన్ని ఆపదలు!! అన్నీ దాటుకువచ్చాను-నా జీవితం.... కాదు ఆడదాని జీవితమే పరమపద సోపాన పటం! ఇక్కడికిది దాటేమనుకుంటే చాలు మళ్ళీ మరొకటి....దినదినగండం! నిచ్చెనలు పాములు! సంతోషం, దుఃఖం!

సూర్యుడు తన చుట్టూ భూమిని తిప్పుకుంటాడు; కాని-భూమి తన చుట్టూ తాను తిరుగుతూనే సూర్యుని చుట్టూ కూడా తిరగాలి!

సరిగ్గా యిదే ఆడదాని జీవితం!

పురుషునికి ఒకే బాధ్యత! కాని స్త్రీకి అలాక్కాదు. తనను తాను రక్షించుకుంటూ యితర బాధ్యతలను కూడా మోయాలి. అందుకేనేమో స్త్రీని భూదేవితో పోల్చేరు.

ఆ రోజు రానేవచ్చింది....కాని లేటుగా-వేళకురాని రైలులా. వేచివేచి విసిగిన ప్రయాణీకురాలిని....కాని....యీ జీవిత ప్రయాణం ఎప్పుడయినా చేయక తప్పదు....ఈ చోటు నుండి మరొక చోటుకు వెళ్ళక తప్పదు!

అందరూ ఎక్కేది ఒకే రైలు అయినా, గమ్యస్థానం కూడా ఒకటే అయినా, కొనుక్కున్న టిక్కట్టు బట్టి (చేసుకున్న పుణ్యం) కొందరు ఫస్ట్‌క్లాసులో హాయిగా, కొందరు సెకండ్ క్లాసులో కష్టపడుతూ చేరుకుంటారు. ఇంతే జీవితం కూడా.

కొందరి జీవితాలు వర్ధించిన విస్తరిలా, హాయిగా, సాఫీగా సాగిపోతాయి. మరికొందరివి సుఖ దుఃఖాలకలయికలో వెళ్ళిపోతాయి.

మా యింటి ముంగల మంగళ వాయిద్యాలు మ్రోగాయి.

నా హృదయంలో సన్నాయి పలికింది.

మా గుమ్మంలో తోరణాలు వెలిసేయి.

నా మనసులో ఊహాగానాలు కదిలేయి!

మెడలో మంగళ సూత్రం మెరిసింది!

జడలో మల్లె మాలలు నవ్వేయి!

వెన్నెల ప్రక్కనిండా తొంగి చూసింది.

కన్నె మనసు పక్కకి ఒరిగి సిగ్గుపడింది.

పెళ్ళిచేసిన అమ్మా, నాన్నా గుండెల మీద చేతులేసుకొని "కుంపటి" దిగింది కదా అని తేలికపడ్డారు.

పెళ్ళాడిన భర్త హృదయం మీద వాలినపుడు ఆ తీయని స్పర్శ శరీరాన్ని మైమరపించింది.

అతన్ని నేనేం ప్రేమించానా?...లేదు..కనీసం అంతవరకూ మొహమయినా చూడలేదు. చాలా మంది లాగా నెల రోజుల క్రితం పెళ్ళి చూపులలో చూసుకోవడం ఏమిటి? అతను సరే అనడం.... ముహూర్తం నిర్ణయించడం.... పెళ్ళి జరిగిపోవడం అన్నీ యిట్టే జరిగిపోయినాయి.

ఎంత ప్రయత్నించినా యిన్నాళ్ళూ లేనిది యింత వేగిరం జరిగిపోడం ఏమిటి?....నాకే ఆశ్చర్యంగా వుంది! అందుకే కళ్యాణం కలిసివస్తే ఆగదంటారు!

ఎన్నాళ్ళ ప్రయత్నం! ఎన్నెన్ని సంబంధాలు! ఎన్ని పెళ్ళిచూపులు! ఈ రోజుల్లో ఉద్యోగానికి పెట్టిన దరఖాస్తుల్లాగా వృధా అయిపోయినాయి!
ఘటన అంటే యిదే కాబోలు!

ఇన్నాళ్ళూ ఎవరికీ అందకుండా వున్న నేను—ముక్కూ-మొహం తెలియకపోయినా భర్త అని వచ్చిన యితనికి ఏం జంకూ లేకుండా నన్ను నేను అర్పించుకున్నానే! ఎంత విచిత్రం!

నా కోసం తిరిగి తిరిగి, పోజులు కొట్టి అందితే ఒళ్ళూ, అందకపోతే కాళ్ళూ పట్టుకొనే వాళ్ళు, చూస్తే చాలు సంజ్ఞలు చేసేవాళ్ళు, ప్రేమ లేఖలు వ్రాసేవాళ్ళు.... అలా ఎంతమంది గింజుకున్నా తప్పించుకున్నానే గాని నన్ను తాకనివ్వలేదు!

అటువంటిది ఆ మూడుముళ్ళూ కట్టేసరికి కలవరమే లేకపోయింది. నాకు ఆశ్చర్యమనిపించినా లోకానికి మాత్రం లేదు!

*

నాకు పాతికేళ్ళు ఇట్టే దాటిపోయినాయి. 'ఇంక మరి పెళ్ళి కాదు' అనుకున్నారు! 'ఇంతవరకు పెళ్ళెందుకు కాలేదో?....ఏదో వుండి వుంటుంది!' 'దాని గురించి ఎవరూ పట్టించుకోరేం!' ఇలా గుసగుసలు బయలుదేరాయి.

నా గురించి మా వాళ్ళు పట్టించుకోకకాదు. పట్టించుకు వూరుకోకాదు. అంతా అదలా జరిగిపోయింది—కట్నం యిచ్చుకోలేక - యిచ్చే కట్నాలకు సంబంధాలు రాక.

చదువుకొన్నన్నాళ్ళూ, చదువు పూర్తి కానీ తొందరేం అనీ, స్కూల్ ఫైనల్ అయినాక చదువుదాం అంటే-అంతకన్నా ఎక్కువ చదువుకున్న వాళ్ళ సంబంధాలు తేలేక....అలాగే టీన్ ఏజ్ దాటిపోయింది! అట్లాగే జీవితంలో నాలుగో వంతు దాటిపోయింది!

కాని అనుకున్నంత సుళువుగా దాటిపోలేదు! ఆ మధ్య తుఫానులు; ప్రళయాలు! ఎన్నో!!

అక్కయ్యలకు పెళ్ళిళ్ళుచేసి, అన్నదమ్ములకు చదువులు చెప్పించి సంసారం యీదుకుంటూ వచ్చి, అన్ని విధాలా రిటైర్ అయిపోయిన తండ్రిని చూస్తే జాలి వేస్తుంది.

ఇప్పుడు ఎవరి బాధ్యతలతో వారు సతమతమవుతున్న అన్నదమ్ములు — అడిగిన కట్నం యిచ్చుకోడానికి అమ్మ జూపుదామంటే పాత యిల్లేనా లేని కుటుంబం.

అంత వేగిరం ఎలా అవుతుంది పెళ్ళి?

నాకు వచ్చిన సంబంధాలు తలుచుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది.

'ఇదిగో పెళ్ళి వారు వస్తున్నారు చూపులకి' అని అనడం-వారి గురించి వారం రోజులు ముందుగానే యత్నం చేస్తూండడం-మర్యాదల్లో ఏ పొరపాట్లూ జరగకుండా జాగ్రతపడడం-వారికి స్వాగతాలు పలకడం—పెళ్లి చూపులకు తయారు కావడం....వారడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పడం—

అంతా అయినాక వాళ్ళ నోటంట ఏ ముక్క వస్తుందో అని యివతల అందరం ఎదురు చూస్తూ వుంటే—

"మా వూరెళ్ళి వుత్తరం వ్రాస్తాం!" అని వాళ్లు చులాగ్గా అనేసి వెళ్ళిపోయేవారు. ఆ తర్వాత వాళ్ళ ఉత్తరం కోసం ఎంతో ఆత్రుతలో, రోజుల తరబడి ఎదురుచూస్తే - కొందరు "ఇప్పట్లో మావాడి కిష్టంలే"దనో—"మా వాడి చదువు పూర్తి అయేకగాని చేసుకోం" అనో—"మా ఆడపిల్లకి పెళ్లి అయితేనేగాని అబ్బాయి చేసుకోడు" అనో; "మా వాడికి దగ్గిర సంబంధం వున్న"దనో—ఏదో కారణం చెప్పి తప్పుకొనేవారు.

మరి కొందరు ఉత్తరమే వ్రాసేవారు కాదు. అట్లాంటప్పుడు-ఆ రావడం-ఆ చూసుకోవడం ఎందుకో? ఆడపిల్లకది ఎంత అవమానమో గ్రహించలేరూ!

మొదట్లో యీ తతంగం అంతా క్రొత్త అనిపించినా రాను రాను అలవాటయిపోయింది. ఇలా చూసుకుంటూ మర్యాదలు చేయించుకోడం కొందరికి కాలక్షేపంలా వుండొచ్చుగాని — ఒకసారి పెళ్ళిచూపులు జరిగిన తర్వాత మళ్ళీ వాళ్ళ దగ్గర్నుండి కబురూ వచ్చేవరకూ వుండే మధ్యకాలం—వర్ణనాతీతమయేది. ఆ సస్పెన్స్—పెళ్ళికూతురికి, తల్లిదండ్రులకి....కూడా ఆశలు రేపి, నిద్రపట్టని కాలం! ఎటూ తేల్చుకోలేని స్థితి; అయిపోతుందేమో అన్న ఆశ....అవదేమో అన్న నిరాశ....మరో సంబంధం కోసం చూడలేని స్థితి. అదో యుగ సంధిలాటిది....కాని యీ ఆవేదన, ఆత్రుత ఎవరిక్కావాలి?

ఆ సంబంధానికి నీళ్లు ఒదులుకొని—మరో సంబంధం వచ్చేవరకూ మళ్ళీ ప్రయత్నాలు—మళ్ళీ పెళ్ళి చూపులు! మళ్ళీ ఊహాగానాలు! మళ్ళీ ఆశలు!

చదువుకున్న పిల్ల కావాలి! అందమయిన పిల్ల కావాలి, కట్నమిచ్చే పిల్ల కావాలి! అన్నీ ఆడదానికే వుండాలి. పెళ్ళికొడుకుకి పెర్సనాలిటీ లేకపోయినా, సరే! కట్నం అడిగే ధైర్యం మాత్రం వుండాలి.

ఇలా ఎన్నో సంబంధాలు వచ్చి పోయినాయి; నిశ్చయం మాత్రం జరగడం లేదు — చితికిపోయిన మా నాన్న వాళ్ళడిగిన కట్నాలు యివ్వలేకపోయినాడు. చూస్తూ చూస్తూ ఏ అనామకుడికో కట్టబెట్టలేకపోయినాడు.

"మేం సంపాదించి చెల్లి పెళ్ళి చేస్తాం! ఎంత కట్నమయినా యిచ్చి, మంచి సంబంధం చేద్దాం!" అన్న అన్నదమ్ములు వచ్చే జీతంతో వాళ్ళ సంసారాలను పోషించేసరికే సరిపోయి—సిగ్గుపడి వూరుకున్నారు.

ఇహ, స్కూలుకు వెళుతున్నపుడూ, వస్తున్నపుడూ అందరి కళ్ళూ నామీదే వుండేవి. స్కూల్లో స్టూడెంట్సు చేసే అల్లరి, విసిరే విసుర్లూ, చెప్పనలవి కాదు.

స్టూడెంట్ల సంగతి అలా వుంచి — వాళ్ళను అదుపులో పెట్టి, మంచి మార్గంలో నడప వలసిన టీచర్లే ఒక్కొక్కప్పుడు ప్రవర్తించే విధం చూస్తూంటే రోత పుట్టుకొచ్చేది.

పాఠ్య పుస్తకాలలో శృంగార ఘట్టాలు చెప్ప వలసి వచ్చేటప్పుడు వారు చెప్పే విధం, ఉపయోగించే రెండర్థాల మాటల్తో వింటే, ఆడ పిల్లలు మనసులు చచ్చేట్టు అవుతాయి.

"ఏం శాంతా! ఇంగ్లీషులో డౌట్‌గా వున్నట్టున్నావు—సాయంత్రం రాకూడదూ డౌట్స్ క్లియర్ చేసుకోవచ్చును!" అని ఎవరూ లేకండా చూసి అంటున్న మాస్టారి మాటలు వింటూంటే ఆయన విశాల హృదయం అర్థం అవుతూ వుంటుంది!

"ఏమండీ పదిరోజులు వూర్లో లేను! మీ తెలుగు నోట్సు యిస్తారా వ్రాసుకు యిచ్చేస్తాను?" అని రాఘవరావు అడిగేడు.

అడగటం ఏమిటి? నా అభిప్రాయంతోగాని,

నా యిష్టా యిష్టాలతోగాని, ప్రమేయం లేనట్టు చేతులో పుస్తకాలు లాక్కో బోతాడా అన్నట్టున్నాడు.

ఇవ్వనన్నా, లేదన్నా....వాదన. ఆ ప్రసంగం యింకా పొడిగిస్తే – ఎవరో చూడడం; ఏదో ప్రచారం చేయడం...యీ విపరీతాలకన్న, అడిగిన దేదో మొఖాన పారేసి వదిలించుకోవడం ఉత్తమం. ఇలా నేను అనుకొని–యిస్తే అతడు మరోలా వూహించాడు కాబోలు.

రెండు రోజుల తర్వాత పుస్తకం తిరిగి యిస్తూ.

"థాంక్స్ శాంతాదేవిగారూ! నలభై ఆరో పేజీలో కొన్ని రిమార్కు లున్నాయి చూసుకోండి...." అని చిరునవ్వు నవ్వుతూ వెళ్ళిపోయాడు.

"పీడ వదిలింది" అనుకుంటూ – "ఏం రిమార్కు లబ్బా"–అది నలభై ఆరో పేజీ తీసి చూద్దునుకదా అందులో ఒక కాగితం.

ఆ కాగితం ఏమిటో, అందులో ఏముందో వేరే చెప్పనక్కర్లేదనుకుంటాను .... ప్రపంచ చరిత్రలో పేరుపడ్డ రోమియో, మజ్నూ, మొదలయిన ప్రేమికులంతా అతని ముందు బలాదూరట! అతని ప్రేమకు మరేసాటి లేదట! నమ్మకపోతే అనుభవించి చూడమన్నాడు!– నాకు ఏడవాలో నవ్వాలో తెలియలేదు.

అసహ్యం వేసింది, ఒళ్ళు మండింది. నిలదీసి అడిగేనా–తిరిగి ఏదో నామీదకే రాక తప్పదు....! అంచేతా, స్త్రీకి సహజమయిన సిగ్గుచేతా మాటాడకుండా వూరుకున్నాను!

ఆ వుత్తరంమీద, అతనిమీద, నా అభిప్రాయం ఎలా వున్నా, ఆ కాగితాన్ని మాత్రం, సాధ్యమయినంత తొందరగా నాశనం చేయాలి; దానిని ఎవరు చూసినా ప్రమాదం!....నాతప్పే అని అంటారందరూ.

ఎంత విచిత్రం!

అంత ధైర్యంగా, బరితెగించి వ్రాసిన వాడు మొగవాడు. భయం వుండవలసింది-అతనికి....! కాని–దానిని దాచిపెట్టి, అతనిని బయట పెట్టకుండా....నేను భయపడవలసి వచ్చింది!

రోడ్డుమీద, ఎక్కడకు వెళ్ళినా బాడీగార్డ్స్. ఒక్కొక్కప్పుడు ఎంత అసహ్యం వేస్తుందంటే– "ఛీ వెధవ ఆడజన్మ ఎత్తకూడదు!" అనిపిస్తుంది.

సినిమాకు వెళితే సాధ్యమయినంత దగ్గిర్లో కూర్చుని, శ్లేషతో మాట్లాడ్డం, పోజులు కొట్టడం.... కాళ్ళు తగల్చడం .... యింత అన్యాయమా? సమాన హక్కులూ, స్వాతంత్ర్యం అని - దెబ్బలాడి, ఆడది సంపాదించి సాధించినదేమిటి?

పూర్వం చదువు సంధ్యలు లేకపోయినా స్త్రీ అంటే గౌరవం, భయభక్తులూ వుండేవి. ఇప్పుడు ప్రతి స్త్రీ—పురుషుల దృష్టిలో ఒక విలాసిని. అన్ని వస్తువులలాగ అతిసులువుగా లభించే వస్తువు. అంత చులకన అయిపోయింది.

*

మా యింటికి ఎదురుగుండా వున్న యింట్లో రెండు కళ్ళు అనుక్షణం–నన్ను కనిపెడుతూ వుంటాయి. ఆ సంగతి కొన్నాళ్ళకి గాని తెలియలేదు. ఒకనాడు స్నానం చేసి జాకెట్టు వేసుకుంటూంటే, ఎదురుగుండా కిటికీలో రెండు కళ్ళు గుడ్లగూబల్లా చూస్తూండడం చూశాను; అప్పటి నుండి–ఆ కిటికీ తలుపులు మరి తీయకుండా జాగ్రత పడినా, ఆ కళ్ళు మాత్రం వెంటాడుతూనే వున్నాయి. నేను కనబడితే చాలు. ఆ కళ్ళు నా చుట్టూ పరిభ్రమించేవి. నేను డాబా మీదకు వెళితే– ఆ కళ్ళూ ఎదురుడాబా మీద తయారు! పెరట్లోకి వెళితే....సంజ్ఞలు....యిలాటి వెకిలి చేష్టలు ఆరంభించే సరికి....మా నాన్నగారితో

## ఉత్తమ సైకిలిస్ట్



కలకత్తా బంగబాసి కాలేజీలో చదువుతున్న బని ఘోష్–అనే ఇరవై ఏళ్ళ అమ్మాయి – భారత దేశపు స్త్రీలలో ఉత్తమ సైకిలిస్ట్ ('బెస్ట్ ఉమన్ సైకిలిస్ట్ ఇన్ ఇండియా')గా నిర్ణయింపబడింది. పాటియాలాలో ఇటీవల జరిగిన దేశస్థాయి పోటీలో ఈ విద్యార్థిని ఆ విజయం సాధించింది. కుమారి బని ఘోష్ 2వేల మీటర్ల దూరాన్ని 3 నిమిషాల 18.9 సెకండ్ల కాలంలో సైకిలుమీద వెళ్ళి, పదేళ్ల రికార్డును–అధిగమించింది! 1973లో ఆమె సైకిల్ ఛాంపియన్ నెటాయ్ బైసాక్ దగ్గర తర్ఫీదు పొందింది. 74లోనే ఆమె త్రివేంద్రంలో జరిగిన పోటీలలో పాల్గొని 'బెస్ట్ జూనియర్ సైకిలిస్ట్'గా వచ్చింది. క్రిందటి సంవత్సరం బికనీర్‌లోనూ, మళ్ళీ త్రివేంద్రంలోనూ కూడా ఆమె బహుమతులు గెల్చుకున్నది. హైద్రాబాదులో జరిగిన తూర్పుప్రాంతపు పోటీలో కూడా 'బెస్ట్ సైకిలిస్ట్'గా నిర్ణయింపబడి, రెండు స్వర్ణ పతకాలను గెల్చుకున్నది!

చెబుదామనుకున్నా—అనవసరమయిన గొడవలు వస్తాయని వూరుకున్నాను.

అతనినే—"ఏమిటీ పోయేకాలం?" అని అడిగేద్దామంటే—'అమ్మో! యింకేమన్నా వుందా?—యిష్టమో, అయిష్టమో—ఏది మాటాడినా చాలు మొగవాడికి. దానిని బట్టి కథ పెంచేస్తాడు' అని భావించి నాకు ఏమీ పట్టనట్టు వూరుకున్నాను...

ఇది యిలా వుంచి యింట్లోనన్నా క్షేమంగా వున్నానా?....ఇంటి దొంగను ఈశ్వరుడయినా పట్టలేడన్నట్టు—నా అక్కలూ, బావలూ, వచ్చినపుడు నాకు ప్రాణసంకటం అయిపోయేది!

నా చిన్నప్పుడు మా బావలు దగ్గిరకయినా రానిచ్చేవారు కాదు! ఏమీ కొనియిచ్చేవారు కాదు! అక్కయ్యల కొంగులు పట్టుకొని తిరిగే వారు....! నేనూ పెద్దదాన్నయే సరికి, వాళ్ళకి ఎక్కడలేని ఇంట్రెస్టూ నా మీద పుట్టుకొచ్చింది.

రిబ్బన్లని, బట్టలని, పెన్నులని, ఏవేవో ప్రెజంటేషన్లు. ఏదో మిషపెట్టి యిస్తూండడం—యిస్తూ యిస్తూ చేతులు తగిలిస్తూండడం—మొదలు పెట్టారు!

అక్కయ్యలకు తెలియకుండా, నవ్వుతూండడం, హాస్యాలాడుతూండడం ప్రారంభించేవారు. వాళ్ళ వాలకం చూస్తూంటే, నవ్వూ, చికాకూ కలిగేవి. కాని ఏమీ అనలేక పోయేదాన్ని.

పెద్ద బావగారయితే వచ్చినప్పుడల్లా, "మరెందుకే శాంతా! సంబంధాలు చూడడం, నేనున్నాగా! పెళ్ళాడేస్తాను!" అని అంటూ తృప్తి పడేవాడు!

"మా అక్కయ్య సుఖపడింది చాలదా? నిన్ను కట్టుగొని!" అని అందామనుకున్నా.... ఏమనుకుంటారో అని వూరుకొనేదాన్ని—అతని అవస్థకు నాకు నవ్వు వొస్తే, అతను మరోలా భావించి పొంగిపోయేవాడు.

ఇంక చిన్న బావ అయితేనో, మరో మెట్టు ఎక్కువకు పోయేవాడు! అట్టే మాట్లాడకపోయినా ప్రాక్టికల్ మనిషి—అక్కయ్య లేని సమయం కనిపెట్టి....నేను ఏకాంతంగా వున్నపుడల్లా, మాట్లాడుతూ పట్టుకోపోయేవాడు....కాని నేను అక్కయ్యతో చెబుతానని బెదిరించి, "ఆ" అని గట్టిగా అనేటప్పటికి తగ్గేవాడు....అలా చాకచక్యంగా తప్పుకొంటూ, అలాటి సందర్భాలు రాకుండా చూసుకోడం బ్రహ్మాండమయేది.

వీళ్ళందరి ప్రవర్తనా చూస్తూ వుంటే—"ఛీ యీ మగవాళ్ళందరూ యింతేనా? ఆడదంటే మంచి అభిప్రాయమే వుండదా....తమ చెల్లెళ్ళు, తల్లులూ, భార్యలూ కూడా యిలాటి వారే అన్న ఆలోచన వుండదా?" అని అనిపించి కుమిలిపోతూ వుండేదాన్ని.

ఎక్కడవున్నా, ఎక్కడకువెళ్ళినా యీ భయం వెంటాడుతూనే వుండేది! పెళ్ళికాని పిల్లకు యిన్ని భయాలా? ఇన్ని ప్రమాదాలా? తనను తాను కాపాడుకుందుకు యింత ప్రయత్నమా?

ఈ విషవలయం నుండి తప్పించుకుందుకి ఒక్కటే మార్గం—అది పెళ్ళిచేసుకోవడం!

కాని అది అంత సులభం కాదు!

కట్నాలు! కట్నాలు!! కట్నాలు!!!

నా అన్నదమ్ములూ కట్నాలు తీసుకొనే పెళ్ళాడేరు; నాన్నగారూ కట్నం తీసుకొనే అమ్మని చేసుకున్నారు!

"చెల్లికి పెళ్ళి అవుతేనేగాని పెళ్ళాడం!" అని అన్నయ్యలు అన్నా, వాళ్ళకు పెళ్ళిళ్ళు యిట్టే అయిపోయినాయి.

ఎందుకవవు మొగపిల్లలకి? అయ్య వచ్చే వరకూ అమావాస్య ఆగుతుందా? నాకు ఎప్పటికీ పెళ్ళికాకపోతే వాళ్ళు ఎన్నాళ్ళుంటారు?

మొగపిల్లలకి కట్నం తీసుకుని—ఆ డబ్బుతో నా పెళ్ళి చేద్దాం అని మొదట అనుకున్నా....అవి అయేసరికి మిగిలిందేం లేదు! ఎందువల్ల? అని అడిగితే జవాబు లేదు!

అవన్నీ పులుసులో పడిపోయినాయి.

ఇంట్లో నిత్యం, అన్నా, వదినల హాస్యాలూ, సరదాలూ, గుసగుసలూ, నాకు ఏం తెలియదనుకుంటారు కాబోలు!

నా ఎదుటగుండానే—విపరీతార్థాలు వచ్చే మాటలు....! కవ్వించే చేష్టలు!

ఈ విధంగా చుట్టూ రేకెత్తించే వాతావరణం! ఎక్కడా శాంతి కనబడలేదు!

రానురానూ అందరికీ బరువు అయిపోయినట్టున్నాను....!విచిత్రం! పెళ్ళికానంతమాత్రంలో ఏమిటీ మార్పు?

ఇంటికెవరొచ్చినా అదే మాట!

"ఇంకా పెళ్ళికాలేదా? ఎదిగిన పిల్ల. వేగిరం ఏదో సంబంధం చూసి ముడిపెట్టెయ్యండి!"

అందరికీ నా పెళ్ళిగొడవే కావాలి! నాకు లేని బాధ వీళ్ళకెందుకో?

ఇంట్లో వదినగార్ల సూటిపోటి మాటలు! తెలిసినా తెలియనట్టు వూరుకొనే అన్నయ్యలు, పెళ్ళి చేయలేకపోయాననే అసమర్థత వల్ల నాన్నగారి తిట్లు.

క్రొత్తగా వచ్చిన కోడళ్ళకు అది సొంత యిల్లయింది; పెళ్ళికానంతమాత్రంలో నా పుట్టిల్లే నాకు పరాయి యిల్లయిపోయింది, నాకు స్వతంత్రం వుండీ, లేనట్టయింది....నాన్నగారికి, అన్నయ్యలెంతో—నేనూ అంతే—కాని వాళ్ళకున్న స్వతంత్రం నాకు లేదు! మధ్య వచ్చిన వదినగార్ల పాటి అధికారం నాకు లేకుండా పోయింది! వింతగా లేదూ?

అందరికీ, అతిచులకన అయిపోయాను! వీటన్నిటికీ విసిగి—ఈ చిత్రహింస కన్నా.... ఎవరినో ఒకరిని పెళ్ళిచేసుకొని, నాది అనే యింటికి ఎంత వేగిరం పోతానా....ఆ భర్త అని వచ్చేవాడికి నన్ను నేను ఎంత వేగిరం అర్పించుకుందామా అని అనిపించింది.

"ఎవరికో ఒకరికి ముడిపెట్టి నన్ను పంపించి వేయండి!" అని తెగించి చెప్పేద్దామనిపించేది! కాని ఎలా చెప్పగలను?

"ఎప్పటికయినా విముక్తి ప్రసాదిస్తావా? భగవంతుడా?" అని వేయి దేవుళ్ళకు మొక్కుకుంటూ వుండేదాన్ని....

ఆ పెళ్ళి అయేవరకూ యీ స్టూడెంట్సునుండి-సినిమాహాలుల్లో—రోమియోలనుండి—రోడ్డుమీద పోజుగాళ్ళనుండి—ఎదురింటి అబ్బాయిలనుండి—ఇంట్లో బావలనుండి తప్పించుకోగలనా?.... నా పవిత్రతని కాపాడుకోగలనా?

ఇదే నా భయం....! ఇదే నా భయం....?

లేదు....లేదు....తప్పించుకోలేను....అడుగో-ఎదురింటి అబ్బాయి....ఎలాగో చూస్తున్నాడు.... అడుగో....బావ....వద్దు....వద్దు....నన్ను పట్టుకోకు....బావా!

*

....భయంలో కళ్ళు తెరిచేసరికి....నన్ను దగ్గిరగా పట్టుకుంటున్నది బావ కాదు....! నా భర్త.... మత్తెక్కించే పరిమళాలు....మల్లెలు పూచిన పక్క....ఇది నా మొదటి రాత్రి!....కల....కాదు....నిజం....!....పొంగులెత్తినహృదయంతో పులకించిన శరీరంతో .... ఆయనకు మరింత దగ్గిరగా జరిగాను.... □